ప్రజాజ్యోతి
నిజామాబాద్
కామారెడ్డి
ఆదివారం | 6 | ఏప్రిల్ | 2025 | పేజీలు: 5

## పోలీసులు వాహనాలు తనిఖీ

ప్రయాణికులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి
ఎఎస్పై గంగాసాగర్



2

## బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు

# ప్రతి ఒక్కరు కృషి చేయాలి





### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఏప్రిల్ 5.** బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 5, 1908 లో బీహార్ రాష్ట్రం లోని భోకపూర్ జిల్లా చంద్వా గ్రామంలో శోభి రామ్ వాసంతి పుణ్య దంపతులకు జన్మించారని తెలిపారు. ఆయన జీవితం రాజకీయంగా వృద్ధి చెందిందని, క్విట్ ఇండియా పోరాటం, గ్రీన్ రెవల్యూషన్ వంటి పోరాటాల్లో పాల్గొన్నారు తెలిపారు. 1952 .56 సమాచార మంత్రిత్వ శాఖ, 1956.62 లో రైల్వే మంత్రిత్వ శాఖ, 1962.63 లో రవాణా, కమ్యూనికేషన్ శాఖలు నిర్వహించారని తెలిపారు. 1967.70 కాలంలో గ్రీన్ రెవల్యూషన్ లో భాగంగా హరిత విప్లవానికి నాంది పలికారని తెలిపారు. 40 సంవత్సరాలు పార్లమెంట్రియన్ గా, 10 సంవత్సరాలు క్యాబినెట్ మంత్రిగా పనిచేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనారిటీ లకు రాజీవ్ యువ వికాసం క్రింద యువత, అర్హులైన వారు యూనిట్ల స్థాపనకు ఈ నెల 14 లోగా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గత నాలుగు నేలల క్రితం ప్రభుత్వం వసతి గృహాల మేనూ 40 శాతం.పెంచిందని, తద్వారా మంచి భోజనం విద్యార్థులకు అందజేయడం జరుగుతున్నద్ తెలిపారు. ప్రతి ఇన్స్టిట్యూట్ కు ఒక అధికారిని నియమించడం జరిగిందని, విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలను పరిశీలించి నివేదికలు సమర్పించడం జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరుగుచున్నదని, జిల్లాలో 60 శాతం పంపిణీ జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్ర కాంత్ రెడ్డి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ ఎంపీ గా, ఉప ప్రధానిగా పనిచేశారని, రాజకీయంగా ఉన్నతిదయ్యాడని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో శాఖ గ్రంథాలయాలు పనిచేస్తున్నాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ చేయడం జరిగిందని తెలిపారు. అంతకుముందు పలువురు పలు సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, ఆర్డీఓ వీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ కుల సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా


## గ్రామ గ్రామాన పార్టీ జెండా ఆవిష్కరించాలి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పోటీ చేయాలి.
ఇప్పటి నుండే ప్రజల్లో ఉంటూ పోటీకి సన్నద్ధం కావాలి.
ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థులు గెలుస్తారు.
స్థానిక సంస్థల్లో గెలుపే పార్టీ బలాన్ని నిరూపిస్తుంది.
కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



2

## బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ



2

# బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ



**బాన్సువాడ టౌన్ ప్రజా జ్యోతి 05.** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గం చందూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు,బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ముందుగా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న ఆ మహనీయుడి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గం చందూర్ మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆ మహనీయుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన పోచారం. ఈ కార్యక్రమంలో వర్ని మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు సురేష్ బాబా మరియు బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ గ్రామాన పార్టీ జెండా ఆవిష్కరించాలి



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఏప్రిల్ 5.** కామారెడ్డి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం కామారెడ్డి పట్టణంలోని రాజారెడ్డి గార్డెన్స్ లో అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 6 పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో పార్టీ జండా ఆవిష్కరణ చేయాలని సూచించారు. అంతే కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పక పోటీ చేయాలనీ అన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఇప్పటి నుండే ప్రజల్లో ఉంటూ పోటీకి సన్నద్ధం కావాలనీ సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థులు గెలుస్తారనీ, స్థానిక సంస్థల్లో గెలుపే పార్టీ బలాన్ని నిరూపిస్తుందనీ అందుకే ప్రతి ఒక్కరూ పోటీ చేసి గెలిచి ప్రజలకు మరింత పారదర్శకమైన పాలన అందించాలని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, పీపుల్ ,బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరీక్షలు, జీవితం కాదు..!

### మామిండ్ల శ్రీనివాస్. ఎమ్మే, బీఈడీ



**రామారెడ్డి ఏప్రిల్ 05 (ప్రజా జ్యోతి)** పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. అవి మనం నేర్చుకున్నవి ఎంత వరకు అర్థమైందో అంచనా వేయడానికి ఉపయోగపడతాయి. కానీ, పరీక్షలే జీవితం అన్న భావన పూర్తిగా తప్పు. జీవితం అనేక అవకాశాలు, అనేక అనుభవాలతో కూడి ఉంటుంది. ఒక పరీక్షలో విఫలమయితే జీవితం మొత్తం అంధకారంగా మారిపోదు. ప్రతి పరీక్ష ఓ అంచనా మాత్రమే, కానీ అది విజయం లేదా వైఫల్యాన్ని నిర్దేశించే చివరి అంకం కాదు.

### పరీక్షల ఒత్తిడి - విద్యార్థులపై ప్రభావం..!

ఈ రోజుల్లో విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురవుతున్నారు. మంచి ర్యాంకులు, అత్యుత్తమ మార్కుల కోసం శ్రమిస్తూ మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు. కొందరు విద్యార్థులు పరీక్షలలో విఫలమైతే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. మరికొందరు తీవ్ర మానసిక సంఘర్షణకు గురై కుంగిపోతున్నారు. ఇది వారి భవిష్యత్తును ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. వాస్తవానికి, ఒక పరీక్షలో వచ్చిన మార్కులు వారి జీవితాన్ని నిర్ణయించలేవు. ప్రతివ్యక్తికీ ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయి. కొంతమందికి గణితం బలంగా ఉండవచ్చు, మరికొందరికి భాషలు, సైన్స్, కళలు, క్రీడలు బలంగా ఉండవచ్చు. మార్కులు మాత్రమే కాదు, మన యొక్క నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా విధానం కూడా మన విజయంలో కీలకపాత్ర వహిస్తాయి.

### విజయానికి మార్గాలు అనేకం..!

పరీక్షలలో విఫలమైన వారు జీవితంలో గొప్ప విజయాలు సాధించిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. అల్బర్ట్ ఐన్‌స్టీన్ చిన్నప్పుడు మంచి విద్యార్థి కాలేదు, కానీ ఆయన ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త అయ్యారు. థామస్ అల్వా ఎడిసన్ అనేకసార్లు విఫలమయ్యారు, కానీ ప్రపంచాన్ని మార్చిన పరిశోధనలు చేశారు. ఇవే కాకుండా, జీవితంలో విజయం అనేక మార్గాల్లో సాధించవచ్చు. ఒక రంగంలో విఫలమైనప్పుడే, ఇంకో రంగంలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. మనకు ఆసక్తి ఉన్న విషయాలను అర్థం చేసుకుని, వాటిని అభివృద్ధి చేసుకుంటే, మరింత మంచి భవిష్యత్తును సృష్టించుకోవచ్చు.

### పరీక్షలు అనేవి ఒక అంచనా మాత్రమే..!

పరీక్షలు అవసరమే, కానీ అవి మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించలేవు. విద్య అనేది మార్కులకే పరిమితం కాదు. మంచి వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, పరిశీలనా శక్తి, క్రమశిక్షణ కూడా విజయానికి కీలకం. విద్యార్థులు పరీక్షలపై భయపడకుండా, వాటిని ఒక అవకాశం గా భావించాలి. ఒక పరీక్షలో సరిగ్గా రాయకపోయినా, తదుపరి అవకాశాలను వినియోగించుకోవచ్చు. ప్రతిసారి కొత్తగా నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. విఫలమైనా మనలో ఉన్న శక్తిని గుర్తించి, ముందుకు సాగాలి.

### తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భూమిక..!

తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పిల్లలపై ఎక్కువ ఒత్తిడి తేవకూడదు. పరీక్షలు ముఖ్యమైనవే, కానీ అవి జీవితాన్ని నిర్ణయించే అంశాలు కావు. పిల్లలకు ప్రోత్సాహం ఇవ్వాలి, వారి ఆసక్తులను గుర్తించాలి. వాళ్లను మార్కుల కోసం ఒత్తిడికి గురిచేయకుండా, వారి నైపుణ్యాలను మెరుగుపరిచేలా ప్రేరేపించాలి.

### పరీక్షల సమయంలో ఇలా..!

పరీక్షలు కేవలం ఒక అంచనా వేసే పద్ధతి మాత్రమే. అవి జీవితాన్ని నిర్ణయించలేవు. ఒకసారి మార్కులు తక్కువ వచ్చినా, అది జీవితాంతం ప్రభావం చూపదు. కష్టపడి పని చేస్తే, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే, విజయం తప్పక వస్తుంది. కాబట్టి, విద్యార్థులు పరీక్షలను భయపడాల్సిన అవసరం లేదు. పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే, గమ్యం కాదు. విజయానికి అనేక మార్గాలు ఉన్నాయి. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే, నిజమైన విజయం సాధించవచ్చు.



## పలు గ్రామాలలో పాదయాత్ర చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

**రెంజల్, ఏప్రిల్ 05(ప్రజాజ్యోతి):** అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రెంజల్ మండల కేంద్రంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై బాపూ,జై భీమ్, జై సంవిధన్ అనే నినాదంతో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పథకాల గురించి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జావిదోద్దిన్,సాయి రెడ్డి,సాయిబాబా గౌడ్, ధనుంజయ్, రాములు, నితిన్, అనిల్,రాజు, కార్తీక్, కిరణ్,రాకేష్,శ్రీకాంత్,దత్తు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

### ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**రెంజల్, ఏప్రిల్ 05(ప్రజాజ్యోతి):** రెంజల్ మండలంలోని తాడిబిలోలి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తాడి బిలోలి గ్రామంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ ద్వారా వచ్చిన చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామ రామాలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్, సాయి రెడ్డి, జావిదోద్దీన్,సాయిబాబా గౌడ్, రాములు, ధనుంజయ్, రాజు, నితిన్, నర్సన్న,కార్తీక్ యాదవ్, కిరణ్, శ్రీకాంత్,ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, గంగాధర్, అశోక్,నరేష్,సాయమ్మ, అవధుత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు వాహనాలు తనిఖీ

**సదాశివ నగర్.ఏప్రిల్ 5 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలంలో స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ వద్ద ఏఎస్ఐ గంగాసాగర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు వాన దారులకు పలు సూచనలు చేసినారు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని వారు అన్నారు వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ లైసెన్స్ ఆర్ సి దగ్గర ఉంచుకోవాలని వారు అన్నారు ప్రతి ఒక్క వాహనదారుడు సీట్ బెల్ట్ ధరించాలని వాన దారులకు పోలీసులు సూచించారు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నివారణ అరికట్టవచ్చని ఏఎస్ఐ గంగాసాగర్ అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాసాగర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారాయణ ఒలంపియాడ్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్




**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** ఆర్మూర్ పట్టణంలోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల హాజరయ్యారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల, పాఠశాల ఏజీఎం శివాజీ,ప్రిన్సిపాల్ రజనీకుమారిలు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల మాట్లాడుతూ విద్యార్థులపై విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇప్పటినుంచే విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఏజీఎం శివాజీ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని,రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. నారాయణ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారని జీఎం గోపాల్ రెడ్డి, డీజీఎం రమణ రెడ్డిలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్స్ అజీమా, కల్పనా, ఏవో నవీన్, వీపీఎస్ శైలజ రాణి,స్రవంతి, ఉపాధ్యాయిని,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం




**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్ పోలీసు కమీషనరేట్ కార్యాలయంలో సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు అదనపు పోలీస్ కమీషనర్ (ఎ. ఆర్) రామచంద్ర కార్యాలయ అధికారులు, సిబ్బందితో కలిసి బాబు జగ్జివన్ రామ్ 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డి. సి. పి ( ఎ. ఆర్ ) మాట్లాడుతూ 1908 ఏఉప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని షాబాద్ జిల్లా జిల్లా చంద్వా గ్రామంలో జన్మించారు. అతడు ముట్టుకున్న కుండలో నీటిని తాగడానికి అధి పత్య కులాల విధ్యార్థులు నిరాకరించడంతో మొదటిసారి అంటరానితనానికి గురయ్యాడు. సామాజిక,రాజకీయ,బానిసత్యంపై జీవితాంతం,యుద్ధం చేసిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్. స్వరాజ్య ఉద్యమంతో పాటు దేశ పునర్నిర్మాణంతో ముడిపడిన ఆయన జీవితం రాజకీయ,సామాజిక,చారిత్రక ప్రాధాన్యత కలిగిందన్నారు. ఈ కార్యాక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం,సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ సతీష్,రిజర్వు ఇన్స్ పెక్టర్స్ తిరుపతి (అడ్మిన్),శ్రీనివాస్ (వెల్ఫేర్),శేఖర్ బాబు,ఆఫీస్ సూపరింటెండెంటులు శంకర్, బషీర్,సి.సి.ఆర్.బి సిబ్బంది,ఐ.టి కోర్ సిబ్బంది,పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది,సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది,స్పెషల్ పార్టీ సిబ్బంది హెూమ్ గార్డ్సు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ పాదయాత్ర





**నాగిరెడ్డిపేట్,ఏప్రిల్ 05(ప్రజాజ్యోతి):** టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించినట్లు మండల నాయకులు తెలిపారు.దాంట్లో భాగంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని బొల్లారం, జప్తి జానకంపల్లి గ్రామలలో పాదయాత్ర నిర్వహించామని ఈ పాదయాత్రను మండలంలోని వివిధ గ్రామాల్లో పది రోజులపాటు నిర్వహిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని,రాజ్యాంగ రచయిత అంబేద్కర్ పై,స్వాతంత్ర ఉద్యమ రథసారథి మహాత్మా గాంధీపై నీచంగా వ్యాఖ్యలు చేస్తుందన్నారు. ప్రజలు ఉమ్మడిగా మరో సత్యాగ్రహాన్ని చేయాలని రాహుల్ గాంధీ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపు నివ్వడంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సూచనల మేరకు మదన్ మోహన్ ఆదేశాలతో గ్రామాల్లో పాదయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య,క్రమశిక్షణ కమిటీ సభ్యులు రాంచంద్రా రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జీవరత్నం,మండల యూత్ అధ్యక్షులు శ్రీరాంగౌడ్,నాయకులు కిష్టాఫర్,ప్రభాకర్,వర్జ్య నాయక్, దేవకుమార్,హైమద్ ప్రభుగౌడ్ అనంత రాజ్,ఆజార్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరామనవమికి సర్వం సిద్ధం

### ముస్తాబైన సీతారామచంద్ర రాజరాజేశ్వర ఆలయాలు

### ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

**రామారెడ్డి ఏప్రిల్ 05 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ యొక్క ఆలయ విశిష్టత పురాతన ప్రాచీన కట్టడాలలో పవిత్రమైన ఆలయముగా ప్రత్యేక, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతిరోజు జరుగుతున్న ఉత్సవాల లో భాగంగా భద్రాచలంలోని భద్రాద్రి రామయ్యకు జరిగే బ్రహ్మోత్సవాలకు దీటుగా ఈ యొక్క ఆలయంలో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా కన్నుల విందు గా జరపడం ఆనవాయితీ, ఈ యొక్క బ్రహ్మోత్సవాలను తిలకించడానికి భక్తులు తండోపతండాలుగా సీతారామ చంద్ర స్వామిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకుంటారు. అదేవిధంగా శ్రీరామనవమి సందర్భంగా సీతా రామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ యొక్క కల్యాణానికి దంపతులు పాల్గొని స్వామివారి కల్యాణ వేడుకలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవుతారు.తదుపరి ఉభయ ఆలయాల ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పురవీధుల గుండా భక్తులకు దర్శనాన్ని కలిగిస్తారు. యొక్క కార్యక్రమాలు దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో , ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అదేవిధంగా భక్తులు ప్రజలు పాల్గొని స్వామివారి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

## జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**బాన్సువాడ ప్రజా జ్యోతి ఆర్ సి ఏప్రిల్ 05** బాన్సువాడ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ దండు విజయ్ కుమార్ మూడు రోజుల క్రితం గుండెపోటుకు గురయ్యారు. నిజామాబాద్ లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు వాల్స్ బ్లాక్ కావడంతో వైద్యులు స్టెంట్స్ వేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జర్నలిస్టు లు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. బాన్సువాడ జర్నలిస్ట్ లు 30,500 ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు జర్నలిస్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బైరి సుధాకర్ గౌడ్, కార్యదర్శి గంట చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్ట్ లు మల్లికార్జున్, వైవి ప్రసాద్, సతీష్ గౌడ్, డాంగే గంగాధర్, ప్రచేతన్ కుమార్, ఎర్రవటీ పోశిరాం తదితర జర్నలిసులు పాల్గొన్నారు.

## పిట్లం జగ్జీవన్ రామ్ జీవితం నేటి తరానికి ఆదర్శం

### ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంత్ రావు



**పిట్లం ఏప్రిల్ 05( ప్రజా జ్యోతి)** పిట్లం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంత్ రావు శనివారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ప్రతి ఒక్కరు ఆయన సిద్ధాంతాలను పాటించాలని తెలియజేశారు. దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమ కోసం అలుపెరుగని కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు.కార్యక్రమంలో హన్మండ్లు, మోహన్ రెడ్డి, రాంరెడ్డి, బొడ్ల రాజు, నజీర్, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కోదండరామాలయం అభివృద్ధికి 10,000 విరాళం అందజేత



**ప్రజాజ్యోతి ఆర్ సి బీర్కూర్ 05** బీర్కూర్ మండల కేంద్రంలోని కోదండరామాలయం అభివృద్ధి కొరకు శనివారం బీర్కూర్ కు చెందిన యాట పర్వయ్య, నారం గంగారాంలు ఒక్కొక్కరు 5000 రూ. ఐదు వేలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల విట్టల్, యామ రాములు, బస్వరాజ్, వీరేశం, ప్రసాద్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**నాగిరెడ్డిపేట్,ఏప్రిల్05(ప్రజాజ్యోతి):** బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అంబె డ్కర్ విగ్రహం వద్ద నాగిరెడ్డిపేట్ ఎమ్మార్పియస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పియస్ మండల అధ్యక్షుడు తొంట సాయిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అర్పించిన మహానుభావులు. గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, పరిపాలన నిపుణుడు బాబు జగ్జీవన్ రామ్ అని జాతీయ నాయకుడిగా, పార్లమెంట్ సభ్యుడి గా, కేంద్ర మంత్రిగా పనిచేస్తూ అణగారిన తరగతుల అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిన ఘనత జగ్జీవన్ రామ్ అని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ మండల ఉపాధ్యక్షుడు కర్రే బాగాని దావీద్,ప్రధాన కార్యదర్శి కొంటోళ్ల రాజు,సహాయ కార్యదర్శి రవి,రంగేరి సాయిలు, దేవసాయం, నీలం రవి,బండెల్ల అశోక్,బిక్షపతి,సాయిలు,తదితరులు పాల్గొన్నారు.

## అకస్మాత్తుగా మంటలు.. స్కార్పియో వాహనం దగ్ధం



**కామారెడ్డి రూరల్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 05** కామారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి దగ్గర శనివారం తెల్లవారుజామున ఓ స్కార్పియో వాహనంలో మంటలు వచ్చి తగులబడిందని దేవున్ పల్లి ఎస్ఐ రాజు తెలిపారు. భువనగిరి నుండి బడాపహాడ్ దర్గాకి వెళ్తుండగా క్యాసంపల్లి దగ్గర వాహనంలో పొగలు రాగా అందులోని ప్రయాణికులు దిగిన కాసేపటికే మంటలు చెలరేగాయని, ఈ ఘటనలో ఎవరికి ఏమి కాలేదని వాహనం కాలిపోయిందని తెలిపారు. ప్రయాణికులు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



## బీర్కూర్లో ఘనంగా ఏనుగు రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**బీర్కూర్ (ప్రజా జోతి) ఏప్రిల్ 05** బీర్కూరు మండల కేంద్రంలోని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఏనుగు రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఒకరికొకరు సీట్లు పంచుకుంటూ ఘనంగా నిర్వహించుకున్నారు ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు మాజీ శాసనసభలు ఏనుగు రవీందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు పోగు పాండు హైమద్ పోతుల వెంకటేష్ నర్రా సాయిలు విట్టల్ సతీష్, రామచందర్ కమలాకర్ రెడ్డి రవి సాయిలు, శ్రీనివాస్ టైగర్ సాయిలు రమేష్ కృష్ణ రెడ్డీ పాల్గొన్నారు



## డిగ్రీ కళాశాల నందు బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలు

**సదాశివ నగర్.ఏప్రిల్ 5 (ప్రజా జ్యోతి)** సదాశివ నగర్ మండలంలోని మర్కల్ గ్రామం నందు ఉన్న తెలంగాణ మహిళా డిగ్రీ కళాశాల నందు బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలు సందర్భంగా, ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి ఆధ్వర్యంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల– కామారెడ్డి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, సమాజానికి ఆయన అందించిన సేవలను ప్రస్తావిస్తూ ప్రేరణాత్మకమైన ప్రసంగాలు, పాటలు ఆలపించారు. విద్యార్థులు, సమానత్వానికి మద్దతుగా నిలిచిన మహానాయకుడిగా ఆయన చేసిన కృషిని, సామాజిక న్యాయం మరియు ఐక్యత కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు.మరియు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈరోజు కార్యక్రమం లో అధ్యాపకులు డాక్టర్. ఉజ్మాసుల్తానా, శారద, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



**మాచారెడ్డి ప్రజాజ్యోతి ఏప్రిల్ 5.** మాచారెడ్డి మండలంలో వ్యక్తి అదృష్టమైనట్లు ఎస్సై అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు జిల్లాకు చెందిన రాయి నూతల సుధాకర్ అనునతను బ్రతుకుతెరువు నిమిత్తం మాచారెడ్డి మండలం ఘనపూర్ గ్రామం కి వచ్చి ఒంటేరు కిష్టయ్య అనే మేస్త్రి దగ్గర లేబర్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తేదీ 3 – 4 – 2025 నా ఉదయం 11. గంటల ప్రాంతంలో సుధాకర్ ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయి తిరిగి రానందునా తన మేస్త్రి అయిన ఒంటేరు కిష్టయ్య ఇచ్చిన దరఖాస్తు మేరకు మిస్సింగ్ కేస్ నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

# బిఎస్పి పార్టీ రాష్ట్ర అధ్యక్షునీ జన్మదిన జరుపుకున్న బిఎస్పి నాయకులు

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఏప్రిల్ 5.** తెలంగాణ బహుజన సిద్ధాంతకర్త, తన రాజకీయ శిక్షణ తరగతుల ద్వారా రాష్ట్రంలో అనేక మంది బహుజన్ సమాజ్ పార్టీ నాయకులను తయారు చేసినటువంటి గొప్ప వ్యక్తి, బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా కామారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయం లో కేక్ కటింగ్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించరూ. సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని రాజకీయ రంగంలో జనాభా దామాషా ప్రకారం సమానంగా హక్కులు కల్పించే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు ఈసిరికాయల




సాయిలు, ఎల్లారెడ్డి టౌన్ అధ్యక్షులు మర్లు సాయిబాబా పాల్గొన్నారు.

### బీఎస్పీ కామారెడ్డి అసెంబ్లీ నుతన కమిటీ ఏర్పాటు..

నూతనంగా కామారెడ్డి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి గుండెల్ని ప్రవీణ్, కార్యదర్శి శేర్ల శివ సాయి, కోశాధికారి బానోత్ పీర్య నాయక్, జిల్లా అధ్యక్షులు హరిలాల్ నాయక్ ఆధ్వర్యంలో కామారెడ్డి అసెంబ్లీ కమిటీ చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన గుండెలు ప్రవీణ్ న కండువా కప్పి జిల్లా అధ్యక్షుడు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి బి ప్రభుదాస్, బిక్నూర్ మండలం, కాచాపూర్ గ్రామం నాయకి దినేష్ బహుజన సమాజ్ పార్టీలో చేరారు.

## నేడు సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకలో పాల్గొననున్న ఎమ్మెల్యే

### ఎమ్మెల్యే మదన్మోహన్ రావు



**రామారెడ్డి ఏప్రిల్ 05 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రాచీన కట్టడాలలో ప్రసిద్ధి చెందిన శ్రీ సీతారామచంద్ర రాజరాజేశ్వర ఉభయ ఆలయాలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ రావు , పాల్గొననున్నట్లు ఆలయ చైర్మన్ రంగు రవీందర్ గౌడ్, అభివృద్ధి కమిటీ సిబ్బంది, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాండ్ల నర్సింలు, ఆయా కమిటీల సభ్యులు, ధర్మకర్తలు, ఇంచార్జ్ ఆలయ ఈవో ప్రభు గుప్తా,స్థానిక గ్రామ ప్రజలు భక్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరు అని ఆలయ సిబ్బంది తెలిపారు.



## సైబర్ క్రైమ్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఏప్రిల్ 5.** కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కమ్మరిగల్లి, బట్టు గల్లి, కాకర్ల గల్లి, కుంబాల గల్లీ నివాసులతో కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వార్డు ప్రజలకు నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేసి ప్రమాదంలో చిక్కుకొవద్దని, బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసుకోవద్దని తెలిపారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ల వల్ల యువత అప్పుల పాలై ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. సైబర్ క్రైమ్, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ల వల్ల కలిగే నష్టాలను వార్డు ప్రజలకు, యువకులకు వివరిస్తూన్న పోలీసులు సిబ్బంది ప్రవీణ్ గౌడ్, అనిల్ రెడ్డి, మురళి కృష్ణ లు వివరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గెరిగంటి లక్ష్మినారాయణ, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణం చూతము రారండి






## ముస్తాబైన రామాలయాలు,హనుమాన్ దేవాలయాలు ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ ధర్మకర్తలు

**నాగిరెడ్డిపేట్,ఏప్రిల్05(ప్రజాజ్యోతి):** శ్రీరామ నవమి పర్వదినం సందర్బంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్ పెట్,తాండూర్ గ్రామాలల్లోని రామాలయంలో సీతారాములు కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల ధర్మకర్తలు తెలిపారు. తాండూర్ గ్రామంలోని రామాలయంలో ఆలయ ధర్మకర్త కొమ్మ దత్తు,కొమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోపాల్ పెట్ రామాలయంలోని ధర్మకర్త మొలుగు అంజయ్య గుప్త ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో శ్రీరామనవమి సందర్బంగా సీతారాములు కళ్యాణం వైభవంగా నిర్వహిస్తామని.అందులో భాగంగా నేడు శ్రీరామ నవమి పర్వదినం సందర్బంగా సీతారాముల కళ్యాణంకు రామాలయం నుండి సీతారాముల ఉత్సవ మూర్తులను పల్లకిలో ప్రధాన విధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి వేదామూర్తులైన బ్రహ్మణోత్తముల వేద మంత్రాల మధ్య కళ్యాణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.సీతారాముల కళ్యాణం కోసం భక్తుల సౌకర్యార్థం మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదలు స్వీకరించాలని వారు కోరారు.

# డిఏలు, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలి

### కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఏప్రిల్ 5.** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో టి పి టి ఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావ్ జయంతి కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడిన నాలుగు వాయిదాల డిఏను, జులై 2023 నుండి అమలు చేయాల్సిన పీఆర్సీని అడగొద్దని, అవి కావాలంటే నెలనెలా జీతాలే ఇవ్వలేమని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించటాన్ని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని వారికి న్యాయంగా రావాల్సిన బకాయిలను లేదా వారు దాచుకున్న సొమ్మును వారికి తిరిగి చెల్లించాలని మాత్రమే అడుగుతున్నారని టి పి టి ఎఫ్ స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెసు పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో నిర్దిష్ట గడువుతో పలు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. సగం మంది ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు మాత్రమే నెల మొదటి తేదీన వేతనాలు ఇవ్వడం మినహా మరే సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలలు సమయమిచ్చామని, ఈ కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, నూతన పథకాలకు వేల కోట్ల రూపాయలు కేటాయించి అమలు చేస్తున్న ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలు, బకాయిలకు డబ్బులు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగులు ప్రభుత్వంలో, ప్రజల్లోనూ భాగంగా ఉన్నారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. ఐదు నెలల క్రితం ఉద్యోగ సంఘాల జెఏసి ప్రతినిధులతో జరిపిన సమావేశంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కారం చేస్తామని, ఈ లోగా ఆర్థిక భారం లేని సమస్యలను శాఖలవారీగా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు ఏ శాఖ ప్రతినిధులతోనూ మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరగలేదు. ఆర్థిక, ఆర్థికేతర అనే తేడా లేకుండా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని టి పి టి ఎఫ్ ఆరోపించింది. ఈ ధోరణి ప్రభుత్వానికి మంచిది కాదని, సాధారణ ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తి తీవ్రమై పోరాటానికి దారితీసే అవకాశం ఉందని. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టిపిటిఎఫ్ డిమాడ్ చేస్తుందన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే డబ్బులు ఇప్పటివరకు ఇవ్వకపోవడం, 2023 పదవ తరగతి మూల్యాంకన డబ్బులు కూడా ఇప్పటివరకు చెల్లించకపోవడం శోషనీయం వెంటనే డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ నాగభూషణం జిల్లా ఉపాధ్యక్షురాలు నలినీ దేవి, జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మి, నరేందర్, ప్రకాష్, గోప్ శ్రీనివాస్, నారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## చోరిలకు పాల్పడుతున్న

# దొంగ అరెస్టు

**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** జల్సాలకు అలవాటు పడి చోరీలు పాల్పడున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎల్.రాజా వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నాందెడ్ జిల్లాలోని కార్లా గ్రామానికి చెందిన నాందేవ్ ఆనందరావు జల్సాలకు అలవాటుపడి జిల్లాలోని పలు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడు. గతంలో కూడా ఈ నిందితుడు పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడు. గతనెల 5న మాక్లూర్ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన పరశు దేవానందం తన ఇంట్లో చోరీ జరిగిందని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మాదాపూర్ లోనిసీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు పాత నేరుస్తుడని గుర్తించారు. మాణిక్ బండార్ చెక్క వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసిన నిందితుడు అనుమాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా తాను చేసిన దొంగతనాలను ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి 91గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే నిందితుడిని రిమాండ్ కు తరలించారు. ఈ కేసు చేధనకు నిజామాబాదు డివిజన్ అసిస్టెంట్ కమీషనర్ అఫ్ పోలీస్ ఎల్.రాజా వెంకట్ రెడ్డి అధ్వర్యంలో నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్, మాక్లూర్ ఎస్ఐ.ఎం రాజశేకర్, సిబ్బందిని అభినందించారు.



## బాబు జగ్జీవన్ రాం 118 జయంతి వేడుకలు నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకులు బంగారు రవి

**ప్రజా జ్యోతి ఆర్ సి బీర్కూర్ 05** బీర్కూర్ మండలం కేంద్ర లోని బాబు జాగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకొని బీ ర్కూర్ కామప్ప కూడలిలో %ఎతీజూం% నాయకులు బంగారు రవి పూలమాల వేసి ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయేదుడీగా, సంఘ, సాంస్కృతికుడిగా తన పరిపాలన యావత్ భారత దేశనికి విశేష సేవలు అందించరాని మాజీ , ఉప ప్రధాని అణగారిన వర్గాల ఆశజ్యోతి డాక్టర్ బాబు జాగ్జీవన్ రామ్ 27ఏళ్ళు కె రాజకీయం లోకి రావడం హర్శించ దగ్గ విషయమన్నారు , ఈ కార్యక్రమములో ఎమ్మార్పీఎస్ నాయకులు బంగారు రవి విరపూర్ మాజీ సర్పంచ్ సాయిరాం, సాయిలు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, సర్పంచ్,గంగారాం,హన్మండ్లు, మాజీ ఎంపీటీసీ వీరేశం,రమేష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాలుగోన్నారు.

## కంప్యూటర్ సైన్సులో బాన్సువాడ వాసి సౌమ్యకు డాక్టరేట్



**ప్రజా జ్యోతి ఆర్ సి బాన్సువాడ, ఏప్రిల్ 5,** కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ విభాగంలో బాన్సువాడ వాసి సౌమ్య డాక్టరేట్ సాధించారు. బాన్సువాడ నియోజకవర్గ%శీ% నర్సుల్లాబాద్ మండలపరిధిలోని బొమ్మన్ దేవుపల్లి గ్రామానికి చెందిన అధ్యాపకులు జంబిగ శంకర్ సతీమణి సౌమ్య అన్నామలై యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. "బిహేవియర్ అనాలసిస్ ఆఫ్ హ్యూమన్ అండ్ అనిమల్స్ యూజింగ్ డీప్ లర్నింగ్" పై పరిశోధన గ్రంథం అందించగా, ఈమేరకు యూనివర్సిటీ డైరెక్టరెట్ ఆఫ్ అకడమిక్ నుండి అవార్డుజారీ చేశారు. యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. బాలసుబ్రమన్యన్, డాక్టర్ వైదేహి పర్యవేక్షణలో గ్రంథం సమర్పించారు. డాక్టరేట్ గ్రహీత సౌమ్య ప్రస్తుతం స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ హైదరాబాదులో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. కళాశాల యాజమాన్యం, సహచర సిబ్బంది, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. బాన్సువాడ ప్రాంత మహిళకు డాక్టరేట్ రావడం పట్ల ఈ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**నాగిరెడ్డిపేట్,ఏప్రిల్05(ప్రజాజ్యోతి):** దేశమాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంపీడీఓ ప్రభాకర్ చారీ బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మెరిగే ప్రకాశ్ పాల్గొన్నారు.



## సన్న బియ్యం పథకం

# పేద ప్రజలకు వరం

### ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతరావు

**ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ మార్చి 05** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పేదలకు వరం అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు.బిచ్కుంద మండలంలోని బండరెంజల్ గ్రామంలో ప్రారంభించారు. ఎల్ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతరావు మాట్లాడుతూ...సన్న బియ్యం పంపిణీ ఒక చారిత్రాత్మక విప్లవం అన్నారు.దేశ వ్యాప్తంగా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రతి నెల ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వల్ల ప్రజలు ఎవరూ వాటిని తినకపోగా.. దళారులకు అమ్ముకోవడంతో పథకం పక్క దారి పట్టి ప్రభుత్వానికి నష్టం వాటిల్లేదని అని అన్నారు.ఇప్పుడు ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం వల్ల పేదల కడుపు నింపడమే గాక.. ఒక్కో కుటుంబానికి రూ. 1500 వరకు ఆదా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమములో నాయకులు పాల్గొన్నారు.

## వేధింపులకు సాఫ్ట్వేర్ ఉద్యోగి ఆత్మహత్య



**కామారెడ్డి రూరల్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 05** ఆన్లైన్ లోన్ యాప్ల వేధింపులు భరించలేక సాఫ్ట్వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్లారెడ్డి సెగ్మెంట్ సదాశివనగర్కు చెందిన సందీప్ (29) హైద్రబాద్ లో సాఫ్ట్వేర్ ఇంజినీర్ గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం సందీప్ ఆన్లైన్ లోన్ యాప్స్ ద్వారా రుణం తీసుకున్నాడు. ఏజెంట్లు ఇబ్బందులు పెట్టడంతో శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.